క్లుప్తంగా

పేదలకు కళ్లజోళ్ల పంపిణీ



పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

బాలాజీచెరువు: బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐ గ్లాస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. లయన్స్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లార్వెన్స్ షిప్పింగ్ అధినేత తలారి రామచంద్రరావు హాజరై, 90 మంది పేదలకు వాటిని పంపిణీ చేశారు. ఐదేళ్ల కాలంలో సుమారు 3 వేల మందికి ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాదం బాలకృష్ణ, జగన్నాథరావు, జీవీఎస్ గాంధీజీ, బాదం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: గణేశ్ నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయ శాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామి వారికి గురువారం మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు మూడు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి సుబ్రహ్మణ్యం, డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ కనపర్తి నాగేశ్వరరావు, దేవదాయ శాఖ కాకినాడ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, ఆలయ ఈఓ రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉమా మనోవికాస కేంద్రానికి వితరణ

కాకినాడ రూరల్: వాకలపూడిలోని ఉమా ఎడ్యుకేషనల్-టెక్నికల్ సొసైటీ(ఉమా మనోవికాస కేంద్రం) వసతి గృహంలో ఉన్న మానసిక దివ్యాంగుల పిల్లలకు 20 ఇనుప మంచాలు, పరుపులు, దిండ్లను కాస్మో కిట్టీ పార్టీ సభ్యులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గరాజు మాట్లాడుతూ, ఉమా మనోవికాస కేంద్రం 36 ఏళ్లుగా నిర్విరామంగా మానసిక దివ్యాంగులకు ప్రత్యేక విద్య, పునరావాస కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వేలాది మంది దివ్యాంగుల జీవితాలలో వెలుగులను నింపుతున్నారన్నారు. తమ వంతు సాయంగా ఈ వసతి గృహంలో ఉన్న మానసిక దివ్యాంగుల పిల్లలకు లక్ష రూపాయల విలువైన ఇనుప మంచాలు , పరుపులు, దిండ్లను కిట్టీ పార్టీ సభ్యులు ఇచ్చినట్టు చెప్పారు.

గుడ్డుతో ఆరోగ్య ప్రయోజనాలు

కాకినాడ రూరల్: నిత్యం గుడ్డు తీసుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్ సువర్ణరాజు అన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు గురువారం గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డులో పోషకాలు నిండి ఉన్నాయన్నారు. అధిక మొత్తంలో ఒమేగా-3 కొవ్వును కలిగి ఉంటాయని చెప్పారు. విటమిన్ ఏ, ఫోలేట్, విటమిన్ బి12, భాస్వరం, విటమిన్ డి, కాల్షియం, జింకు వంటి పోషకాలున్న చక్కని ఆహారం గుడ్డు అని వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మధు

పెద్దాపురం: మండలంలోని దివిలి కిట్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గుడిపాటి మధుకు ప్రతిష్టాత్మకమైన అమెరికా డాక్టర్ ఆఫ్ సైన్స్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన పీహెచ్‌డీ అభ్యసించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజీసీ) ఆర్థిక సాయాన్ని ఫెలోషిప్ రూపంలో అందించింది. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ రంగంలో ఆయన ఇప్పటికే ఆరు పుస్తకాలను రచించారు. అలాగే మల, పెద్దపేగు క్యాన్సర్‌కు సహజ నివారణలు, ఫావిపిరావిర్ రూపకల్పన, క్యారెక్టరైజేషన్, ఇన్ విట్రో మూల్యాంకనంపై మూడు పుస్తక అధ్యయనాలకు ఆయన తన సహకారాన్ని అందించారు. ఒరోడిస్పెర్సిబుల్ ఫిల్మ్, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్, ఎల్సివియర్ వంటి ప్రసిద్ధ పత్రికల్లో 57 పరిశోధన సమీక్ష కథనాలను ప్రచురితం కావడానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఇప్పటికే ఆయన యంగ్ సైంటిస్ట్ అవార్డు (న్యూఢిల్లీ), యంగ్ ఫ్యాకల్టీ, ఉత్తమ ఫ్యాకల్టీ, యంగ్ ఫార్మసీ ఫ్యాకల్టీ, యంగ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డులను అందుకున్నారు. జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సమక్షంలో డాక్టర్ ఆఫ్ సైన్స్ అవార్డును అందుకున్నారు. భారతదేశంలో కేవలం కొద్దిమందికి మాత్రమే ఇటువంటి అరుదైన డాక్టరేట్ లభించినట్టు మధు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న మధును కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ఈఓ జెన్నిబాబు తదితరులు అభినందించారు.

దారి దోపిడీ

- కాకినాడలోని వాహన యజమానుల్లో కలవరం
- తనిఖీల పేరుతో ట్రాఫిక్ పోలీసుల నిర్వాకం
- అందిన కాడికి ఎడాపెడా వసూళ్లు
- తనిఖీ చేసే ప్రదేశాల్లోనే కలెక్షన్ పాయింట్లు
- అక్రమ వసూళ్లకు కమీషన్లు ఇచ్చి బాయ్స్ ఏర్పాటు

కాకినాడ క్రైం: సాగర తీర నగరమైన కాకినాడలో దారి దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది. దొంగ చేతిలో అనుకునేరు. కాదు, కాదు.. అనధికార వసూళ్లతో పేట్రేగిపోతున్న కొందరు ట్రాఫిక్ పోలీసుల చేతుల్లోనే. దీంతో నగర ప్రజలకు బండి తీయాలంటే భయం... కారు తీస్తే కలవరం. కాకినాడ ట్రాఫిక్ పోలీస్ విభాగం లెఫ్ట్ అండ్ రైట్ తనిఖీలతో జనాల జేబులు గుల్ల చేసేస్తోంది. అవేమైనా అధికారిక జరిమానాల అంటే.. అదీ కాదు, చాటుమాటు మామూళ్ల బాగోతం. ఈ వ్యవహారం బయటకి పొక్కకుండా ఉండేందుకు తెల్లచొక్కా సార్లు ఏ ప్రయత్నాన్నీ వీడడం లేదు. వసూళ్లకు వినూత్న పద్ధతులూ అవలంబిస్తున్నారు. ట్రాఫిక్ తనిఖీల పేరుతో చేస్తున్న అక్రమ వసూళ్లకు కాకినాడ వాసులతో పాటు, నగరానికి వస్తున్న వారూ బెంబేలెత్తిపోతున్నారు.

ఓవర్ టైం డ్యూటీలు

కాకినాడ ట్రాఫిక్ విభాగంలో ఓ విచిత్రమైన పరిస్థితి నెలకొంది. సాధారణంగా విధులు నిర్వర్తించేటప్పుడు తక్కువ సమయంలో ముగించేసుకోవాలని లేదా కనీసం ఇచ్చిన 8 గంటల్లోనైనా విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని సిబ్బంది భావిస్తుంటారు. కానీ ట్రాఫిక్ విభాగం ఇందుకు కాస్త విభిన్నంగా ఉంది. ఉన్నతాధికారులు వెయ్యకపోయినా, ఓవర్ టైం డ్యూటీలు చేసేస్తూ తమ ‘నిబద్ధత’ను చాటేసుకుంటున్నారు. దీని వెనుక మర్మానికి మాత్రం సామాన్య ప్రజలే బలవుతున్నారు.

కలెక్షన్ బాయ్స్

తెల్ల చొక్కా సార్లు నేరుగా పుచ్చుకోవడం లేదు. చేతికి మట్టి అంటకూడదనే ఉద్దేశంతో, సమీపంలో ఓ కలెక్షన్ పాయింట్‌ను పెట్టుకుంటున్నారు. మరి కొన్నిచోట్ల యూపీఐ యాప్స్(పేటీఎం, ఫోన్ పే, జీ పే వంటివి)లో చెల్లింపులకు వెసులుబాట్లు కల్పిస్తున్నారు. ఇందుకు ఎవరికీ అనుమానం రాకుండా, ప్రత్యేకంగా బాయ్స్‌ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ కుర్రాళ్లకు వసూళ్లలో 15–25 శాతం కమీషన్‌గా ఇస్తున్నారు. చేతిలో నగదు అందుబాటులో లేనివారు కాస్త దూరంలో నిలబడ్డ ఆ బాయ్ దగ్గరికి వెళ్లి ఫోన్‌పే చేయమంటున్నారు. పెనాల్టీలు కట్టి, కోర్టు చుట్టూ తిరుగుతారా, లేక అడిగింది ఇచ్చి వెళతారా అంటూ నేరుగా పోలీసులే కొంత మొత్తాన్ని నిర్ణయించి చాటుమాటు వసూళ్లకు పాల్పడుతున్నారు.

వ్యాపార కేంద్రాలే..

ఇంకొన్ని చోట్ల చెకింగ్ పాయింట్‌కు సమీపంలో ఉన్న టీ స్టాళ్లు, ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్, జ్యూస్ షాప్‌లు, పానీపూరీ బండ్లు ఇలా కలెక్షన్ పాయింట్లను ఏర్పాటు చేసుకుని కాకినాడ ట్రాఫిక్ పోలీసులు వసూళ్లలో కొత్త పంథా అనుసరిస్తున్నారు. నేరుగా డబ్బు తీసుకోకుండా, సమీపాన ఉన్న వ్యాపార కేంద్రాల్లో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పేమెంట్లు చేసి వెళ్లిపోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ కమర్షియల్ రోడ్‌లో రామకృష్ణ టీ పాయింట్, ఎంఎస్‌ఎన్ చారిటీస్ ఎదురుగా ఉన్న జ్యూస్ పాయింట్, కల్పన సెంటర్‌లో సైస్ ఇంటర్నెట్ కేంద్రంతో పాటు, మరికొన్ని చోట్ల పోలీసుల సూచనలతో వసూళ్లు జరుగుతున్నాయి.

ఎక్కడ పడితే అక్కడే..

కాకినాడ వన్ టౌన్ ట్రాఫిక్ పరిధిలో తూరంగి శివాలయం, ఎంఎస్‌ఎన్ ఛారిటీస్, బాలయోగి బొమ్మ, రామచంద్రాపురం రోడ్డులోని డీమార్టు, రెడ్డిగారి బంకు, తూరంగి రైస్ గోడౌన్లు, దేవాలయం వీధి కొత్త బ్రిడ్జి, ట్రాఫిక్ టూ పరిధిలో ఐడియల్ కాలేజ్, ప్రతాప్ నగర్, మాధవపట్నం, భావనారాయణ స్వామి గుడి, గైగోలపాడు జంక్షన్, ప్రతాప్‌నగర్ రైల్వే ట్రాక్, రాయుడుపాలెం జంక్షన్, కరెంట్ ఆఫీస్, అచ్చంపేట జంక్షన్లతో పాటు, నగరంలో ఇంకొన్ని చోట్ల ఇలాంటి కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటికి అదనంగా అనధికారికంగా పలు చోట్ల తనిఖీలకు తెర తీశారు. ఈ క్రమంలోనే ప్రతాప్ నగర్ వంతెన వద్ద కొద్ది నెలల క్రితం జరిగిన సంఘటన అక్రమ వసూళ్ల హద్దులు దాటిన ట్రాఫిక్ పోలీసుల వైఖరిని తేటతెల్లం చేస్తోంది. ట్రాఫిక్-2 పరిధికి చెందిన ప్రతాప్‌నగర్ వంతెన వద్ద ట్రాఫిక్-1 పోలీసులు వెళ్లి తనిఖీలు చేశారు. వారిని



ట్రాక్టర్‌ను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గమనించిన ఓ ప్రయాణికుడు తన ద్విచక్ర వాహనంతో వెనక్కి తిరిగే క్రమంలో డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అనధికారిక తనిఖీలు చేస్తున్న తాము ఎక్కడ చిక్కుల్లో పడతమోనని భావించిన పోలీసులు, క్షతగాత్రుడిని అక్కడే విడిచి మాయమయ్యారు.

అసలు పనిని పక్కనపెట్టి..

కాకినాడ వన్, టూ ట్రాఫిక్ స్టేషన్ల పరిధిలో సుమారు 50 ట్రాఫిక్ రెగ్యులేషన్ కేంద్రాలున్నాయి. వీటినే ట్రాఫిక్ బీట్లు అంటారు. అక్కడ విధులు నిర్వర్తించాల్సిన కానిస్టేబుళ్లు సమీపంలో తనిఖీలు జరుగుతున్నాయంటే, బీట్లు వదిలేసి మరీ వెళ్లి జేబులు నింపుకొంటారు. కమర్షియల్ రోడ్డు, న్యూబ్రిడ్జి నార్త్, ఇంద్రపాలెం ఐడియల్ కాలేజ్ తనిఖీ పాయింట్లు లారీ బ్రేక్ పాయింట్లు ఇక్కడ వసూళ్ల పర్వం అంతా ఇంతా కాదు. ట్రాఫిక్ బీట్లు వదిలేసి మరీ ఈ పాయింట్లలో పనిచేసేందుకు ఎగబడుతుంటారు.

కేసు రాయమంటావా..?

నగరంలో ఉదయం 10 గంటల నుంచి మొదలవుతున్న తనిఖీలు సాయంత్రం వరకు చేసి, రాత్రి వేళ డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పలు అతిక్రమణలతో పట్టుబడే వారిని కేసు నమోదు చేస్తామని బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. అడిగింది ఇస్తే జరిమానాలు, కేసులేవీ ఉండవని చెబుతున్నారు. తనిఖీల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకపోవడం, ర్యాష్ అండ్ స్పీడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రికార్డులు లేకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, మాడిఫైడ్ సైలెన్సర్లు, కార్లకైతే బ్లాక్ ఫిల్మ్‌లు, సీటు బెల్టు, రాంగ్ పార్కింగ్, ఆటోలైతే ఓవర్ లోడింగ్ వంటి ఉల్లంఘనలు నమోదవుతున్నాయి. వీటికి జరిమానాలు కనిష్టంగా రూ.1,150 నుంచి రూ.10,500 వరకు ఉన్నాయి. దీనిని ఆసరాగా చేసుకుని, జరిమానాకు సగం



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చాలంటూ పోలీసులు ఆఫర్లు ఇస్తున్నారు.

అందుకే ఈ డిమాండ్

తనిఖీల ద్వారా ఒక్కో ఎస్సై కనీసం రోజుకి రూ.10 వేలు వెనకేసుకుంటున్నారనే విషయం ట్రాఫిక్ పోలీస్ సర్కిళ్లలో చక్కర్లు కొడుతోంది. వీరికి అదనంగా హోం గార్డులు, కానిస్టేబుళ్లు అందిన కాడికి దండుకుంటున్నారు. ఎస్సై కంటే కింది, పై స్థాయి అధికారులకు అందుతున్న మొత్తం వీటన్నింటికీ అదనం. 106 మంది అధికారులు, సిబ్బంది ఉన్న కాకినాడ ట్రాఫిక్ విభాగంలో వసూళ్లు జోరుగా సాగుతున్నాయి. అందుకే బదిలీలంటే అధికారులు ఉసూరుమంటున్నారు. కొద్ది రోజుల క్రితం తమలో తామే సర్దుకుందామనుకున్నారో, ఏమో వన్ నుంచి టూ స్టేషన్‌కు, టూ నుంచి వన్ స్టేషన్‌కు కుండమార్పిడి పద్ధతిలో ఉత్తుత్తి బదిలీలకు గట్టి ప్రయత్నాలే చేసి విఫలమయ్యారు. ఓ ఎస్సై కలెక్షన్ల పర్వంలో పేట్రేగిపోయి అడ్డంగా దొరికిపోవడంతో, ఎస్పీ వీఆర్‌కు పంపడంతో.. వారి కుండమార్పిడి ప్రయత్నాలకు బ్రేక్ పడింది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానాలు విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చగా, ఐదుగురికి రెండు రోజుల వంతున జైలు, పది మందికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కాకినాడ సిటీ: వివిధ ఫీడర్లలో వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం రాత్రి తెలిపారు. ఉదయం 6.30 నుంచి 10.30 వరకు కొమ్మిరెడ్డివారి వీధి, పీఆర్ కాలేజీ, అవసరాలవారి వీధి, పిండిప్రోలువారి వీధి తదితర ఏరియాలకు, అదే విధంగా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సాలిపేట, బాలాజీ చెరువు, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, వినుకొండవారి వీధి ప్రాంతాల్లో అంతరాయం ఉంటుంది. అలాగే ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఏసువారి వీధి, చిన్న మార్కెట్ వీధి, విష్ణాలయం వీధి, గుడిమెట్లవారి వీధి, మామిడిపల్లివారి వీధి, ఆకాశపువారి వీధి, చర్చిస్క్వేర్, జగన్నాథపురం పాత బ్రిడ్జి, వేంకటేశ్వరస్వామి గుడి, ఏటిమొగ, బోటు యార్డు, రెవెన్యూ కాలనీ, కోటిస్తంభంపేట, గోళీలపేట, వలందపేట, కెనాల్ రోడ్ ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది. డి7 సెక్షన్‌లోని దుమ్ములపేట, రాజీవ్ గృహకల్ప బ్లాక్స్, తారకరామానగర్, సత్యనగర్, డీ2 సెక్షన్ పోర్టు ఇండస్ట్రియల్ ఏరియా, డెయిరీ ఫారం, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో అంతరాయం ఉంటుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు తూరంగి బుల్లబ్బాయిరెడ్డి కాలనీ, ఈశ్వర్ కాలనీ, సత్యదుర్గానగర్, గోపీకృష్ణాకాలనీ, శివకృష్ణాకాలనీ, హోప్ ఐలాండ్ కాలనీ, యానాం రోడ్ ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

సెల్‌ఫోన్ల ప్రభావంతో పిల్లలు వక్రమార్గం

- ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ అప్పారావు

కాకినాడ సిటీ: సామాజిక మాధ్యమాలు, సెల్‌ఫోన్ల ప్రభావం పిల్లలపై చాలా ఎక్కువగా ఉందని, వీటి ద్వారానే చాలామంది పిల్లలు వక్రమార్గం పడుతున్నారని ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు వ్యాఖ్యానించారు. గురువారం స్థానిక నరసన్ననగర్ కమ్యూనిటీ హాలులో గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలబాలికల సంక్షరణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో, గమనిస్తుండాలన్నారు. రోడ్డు పక్కన



కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పారావు

తినుబండరాల వల్ల పిల్లల ఆరోగ్యం పాడైపోతుందన్నారు. ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి గర్భిణులు, బాలింతలు, బాలలందరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి మాట్లాడుతూ, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం మెక్లారిన్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. బాలబాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. శిశు గృహాన్ని సందర్శించి, హోమ్‌లోని బాలబాలికల ఆరోగ్య స్థితిగతులను ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, పెద్దాపురం, సీడీపీఓ యు ఉషా, బాలల సంక్షేమ సమితి మెంబర్ సంతోషి, కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దయామణి, అరుణదుర్గాంబ పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవలకు ప్రాధాన్యం



జ్యోతి వెలిగిస్తున్న సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

- కేసీబీఎస్ చైర్మన్ కోసూరి

కాకినాడ సిటీ: ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ పురోభివృద్ధికి కారణమైన ప్రతి ఒక్క ఖాతాదారునికి మెరుగైన సేవలను అందించాలని సొసైటీ చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి తెలిపారు. స్థానిక రామయ్యవీధిలోని కేసీబీఎస్ కార్యాలయం ఆవరణలో సంస్థ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ట్రస్ట్ హాస్పిటల్ సౌజన్యంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఖాతాదారుల తోడ్పాటుతో శత వసంతాలు పూర్తి చేసుకున్న కేసీబీఎస్ మరిన్ని మెరుగైన సేవలందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ, సంస్థ పురోభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి మరింత కష్టపడాలన్నారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ వైద్య నిపుణులు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సేవలు అందించారు. చైర్మన్ కోసూరితో పాటు, పాలకవర్గ సభ్యుల జ్యోతి ప్రజ్వలన చేసి, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సొసైటీ మాజీ అధ్యక్షులు కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు నివాళులర్పించారు. సొసైటీ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీప్రసాద్ లావణ్య, ముమ్మిడి వెంకటరమణ, ముత్తా మధు, మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ హాలులో ఏచూరి విగ్రహం నెలకొల్పాలి



సంస్మరణ సభలో ఏచూరికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ సిటీ: జాతీయ సమగ్రతకు ప్రతీకగా, ప్రజాస్వామ్య ప్రగతికి వారధిగా, వామపక్షాల ఉద్యమ సారధిగా యువతరాలకు ఆదర్శంగా నిలిచిన సీతారాం ఏచూరి కాంస్య విగ్రహాన్ని పార్లమెంట్ హాలులో ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు కోరారు. కాకినాడ ఆత్మ బంధువు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు ఏచూరి సీతారాం సంస్మరణ సభ గురువారం సాయంత్రం కాకినాడ జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ భవనంలో జరిగింది. పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు, కో–కన్వీనర్ చింతపల్లి అజయ్‌కుమార్ సభ నిర్వహించారు. కాకినాడ జిల్లాలో నెలకొల్పే విమానాశ్రయానికి ఏచూరి పేరును నామకరణం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ సభ తీర్మానించింది. సభలో జేఎన్టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, ప్రముఖ రచయిత గొడపర్తి సత్యమూర్తి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీరక చంద్రశేఖర్, మాజీ మేయర్లు సుంకర శివప్రసన్న, సుంకర పావని, న్యాయవాదులు, జాన్ జోసెఫ్, జవహర్ అలీ, పేపకాయల రామకృష్ణ, జల్లూరి వెంకటేశ్వర్లు, వామపక్షాల నాయకులు తాటిపాక మధు, మోర్త రాజశేఖర్, హుసేన్ షరీఫ్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, దువ్వా శేషుబాబ్జీ, పెద్దింశెట్టి రామకృష్ణ, కుక్కల పోతురాజు టి రాజా, కొండ తదితరులు పాల్గొన్నారు. పలువురు నాయకులు ఏచూరితో ఉన్న అనుబంధాన్ని సభికులకు వివరించారు.

మానవతా వాది బోయి భీమన్న

కాకినాడ రూరల్: ఆధునిక సాహిత్య రంగంలో ప్రజా సాహిత్యాన్ని సృష్టించిన మహాకవి బోయి భీమన్న సమస్త మానవాళి శ్రేయస్సును కాంక్షించారని మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో బోయి భీమన్న జయంతి గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ, సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసిన గొప్ప వ్యక్తి బోయి భీమన్న అన్నారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ 1911 సెప్టెంబర్ 19న మామిడికుదురు గ్రామంలో జన్మించిన బోయి భీమన్న కుల, మతాల కంటే మానవత్వాన్ని ఆశించిన జాతీయవాది అని చెప్పారు. కుల నిర్మూలనను బలంగా వ్యతిరేకించిన పాలేరు నాటకాన్ని ఆయన రచించారన్నారు. పద్య కవితలు, గేయ, వచన కవితలతో పాటు, పలు నాటకాలను ఆయన రచించారని వివరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి పురస్కారాలను బోయి భీమన్న అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినకర్, వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి దాసరి శ్రీధర్, సభ్యులు ఎం సుబ్బారావు ప్రసాద్ నాయుడు, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ సమీక్షలతో సతమతం

- అదనపు భారమంటూ ఉపాధ్యాయ సంఘం మండిపాటు

బాలాజీచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల వారు మండిపడుతున్నారు. విద్యార్థులకు సిలబస్ బోధించకుండా, డ్రాపౌట్స్‌పై సమీక్షలు, సర్వేలంటూ రాత్రి పది గంటల వరకూ ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉంచుతున్నారని, వీరిలో ముఖ్యంగా మహిళలతో పాటు, 50 ఏళ్ల పైబడిన వారున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికే గత రెండు నెలల కాలంలో తుపాను సెలవులు అధికంగా వచ్చాయని, ఇప్పుడు మళ్లీ ఉపాధ్యాయులను పాఠాలు బోధించనీయకుండా డ్రాపౌట్స్ సమీక్ష పేరుతో సమయం వృథా చేస్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా సగటున చేస్తే డ్రాపౌట్ సంఖ్య వెయ్యికి మించి ఉండదని, దీనికి దాదాపు 18 వేల మంది విద్యార్థులకు తరగతులు బోధించే ప్రధాన ఉపాధ్యాయులు ఈ సమావేశాలకు రావడంతో, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉపాధ్యాయులపై అదనపు భారం ఉండదని చెప్పిన ప్రభుత్వం ఈ విధమైన నిర్ణయంతో అవేదన చెందుతున్నామని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించాలని ప్రధాన ఉపాధ్యాయుల సంఘం కోరింది.

నాడు-నేడుకు రూ.1,400 కోట్లు అవసరం

- రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అకడమిక్ కో–ఆర్డినేటర్ నాగేశ్వరరావు

పిఠాపురం: రాష్ట్రంలో నాడు–నేడు పనులు పూర్తి చేయడానికి రూ.1,400 కోట్ల అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్టు రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అకడమిక్ కో ఆర్డినేటర్ కె.నాగేశ్వరావు చెప్పారు. ఆయన గురువారం గొల్లప్రోలు మండలంలో పలు నాడు–నేడు పనులు జరిగిన పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 45 పాఠశాలలను ఫెంటాస్ పిక్చర్ లోపాలను గుర్తించినట్టు తెలిపారు. మౌలిక సదుపాయాలు అందించడంలో లోపాలు ఉండడంతో పనులు త్వరితగతిన పూర్తి కాలేదని గుర్తించామన్నారు. గత ప్రభుత్వంలో రూ 97 కోట్లు పెండింగ్ ఉందని, ఈ నిధులు సెంట్రల్ రిక్రూట్మెంట్ మెటీరియల్‌కు చెల్లించాల్సి ఉందని చెప్పారు. డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేయాల్సి ఉందని. దీనిపై నివేదికను కమిషనరేట్‌కు 20 రోజుల్లో సమర్పిస్తారని తెలిపారు. కొన్ని జిల్లాల్లో పాఠశాలలపై ఫిర్యాదులు అందాయని, వాటితో పాటు మరి



గొల్లప్రోలులో హైస్కూలును తనిఖీ చేస్తున్న నాగేశ్వరరావు

కొన్నింటిని తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. గొల్లప్రోలు మండలంలోని ఎ.విజయనగరం పాఠశాలతో పాటు, మరో నాలుగు పాఠశాలలపై విచారణ నిర్వహించామన్నారు. చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, గొల్లప్రోలు తదితర పాఠశాలలను పరిశీలించారు. రాష్ట్రంలో పాఠశాలల్లో మిగిలిన పనులను పూర్తి చేయడానికి మరో నెల రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎంఈఓ2 ప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతు వెంకటరమణ తదితరులు ఉన్నారు.

బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలి

- దుకాణం తనిఖీ చేసిన కాకినాడ ఆర్డీఓ

సామర్లకోట: ప్రభుత్వ నిబంధనలను బాణసంచా తయారీదారులు తప్పనిసరిగా పాటించాలని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ ఆదేశించారు. గురువారం మండలంలోని వేట్లపాలెం సూర్యం బాణసంచా షాపులో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలకు కారణమయ్యే పదార్థాలను బాణసంచా తయారీలో ఉపయోగించరాదని ఆదేశించారు. బాణసంచా తయారీలో మహిళలు, పిల్లలను వినియోగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బాణసంచా తయారీలో అనుభవం ఉన్న వారితో మాత్రమే పని చేయించుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించే పరికరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ మేరకు పరికరాల పనితీరును ఆర్డీఓ పరీక్షించారు. లైసెన్సులు లేకుండా బాణసంచా తయారు చేసే వారి వివరాలను సేకరించి, తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సీఐ ఎ.కృష్ణభగవాన్, పెద్దాపురం అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారులు, వీఆర్వోలు ఉన్నారు.

పాము కాటుకు తక్షణ చికిత్స అవసరం

పిఠాపురం: పాముకాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచించారు. గురువారం గొల్లప్రోలు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో అంతర్జాతీయ పాము కాటు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, పాము కాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాము కాటుకు గురైతే చేపట్టాల్సిన వైద్య సేవలపై అవగాహన కల్పించారు. గ్రామీణ పట్టణ ప్రజలు, ముఖ్యంగా వ్యవసాయ, ఉపాధి హామీ పనులు చేసే వారు, ఇతర మట్టి పనులు చేసే కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పాముల జీవన మనుగడకు ఇబ్బంది కలిగినపుడు ఇళ్లలో, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో చేరుతాయన్నారు. పాముకాటు నుంచి కాపాడుకునేలా అందరికీ అవగాహన కల్పిస్తున్నామని గొల్లప్రోలు హెల్త్ సూపర్‌వైజర్ అహ్మద్ బాషా తెలిపారు. విష సర్పాలు చాలా ప్రమాదకరమైనవన్నారు.



గొల్లప్రోలులో పాముకాటుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో పాముకాటుకు తక్షణ చికిత్స ఉందన్నారు. పాముకాటుకు గురైతే, వెంటనే సమీప ఆస్పత్రికి తరలించాలని చెప్పారు. నాటు వైద్యం, మంత్రసానుల వద్దకు పోరాదన్నారు. పసర, ఆకు, అలమ వంటి వాటిని ఆశ్రయిస్తే ప్రమాదం తప్పదని హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోను యాంటీ స్నేక్ వీనం ఉచితంగా అందుబాటులో ఉంటుందన్నారు.